సాక్షి మహబూబాబాద్

శనివారం | 6 | జూలై | 2024



ఉద్యోగ అవకాశాలు

నైపుణ్య పెంపుతో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటున్నారు నిపుణులు. లక్ష్య సాధన కోసం కృషి చేస్తే తప్పక విజయం సాధిస్తారనేది వాస్తవం.

- 8లో



నిరంతర విద్యుత్ - 8లో

నూతన టెక్నాలజీతో నిరంతర విద్యుత్ సరఫరాలో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన నిడిగొండ, చిన్నపెండ్యాల గ్రామాల్లోని సబ్ స్టేషన్లలో జరుగుతున్న పనులను టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
38.2°/23.1°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు కాస్త ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 31 కేసులు నమోదు

మహబూబాబాద్ రూరల్: జిల్లా పరిధిలోని గుడుంబా స్థావరాలపై ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసు అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈమేరకు 210 కిలోల నల్లబెల్లం, 287 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 5,240 లీటర్ల చక్కెర పానకం ధ్వంసం చేసి, 31 కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది మొత్తం 126 మంది పాల్గొన్నారు. గుడుంబా తయారీ, క్రయవిక్రయాలు జరిపిన వారిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. గుడుంబాకు అలవాటుపడి ఎంతోమంది ప్రాణాలను పోగొట్టుకుని కుటుంబాలను ఆగం చేస్తున్నారన్నారు. ప్రజలు తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎవరైనా గుడుంబా తయారు చేస్తున్నట్లు తెలిసినా, అమ్మినా వెంటనే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. మానుకోటను గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి




మహబూబాబాద్: జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రగతి శీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలన్నారు. జీపీ కార్మికులకు వేతనాలు రాక అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ జీఓ 51ను సవరించి జనాభా ప్రాతిపదికన నూతన కార్మికులను నియమించాలన్నారు. ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోతే ఈనెల 11న పంచాయతీ రాజ్ కమిషనర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూర్యం, బిక్కు, మల్లేష్, ప్రమోద్‌కుమార్, మధుకర్, వెంకన్న, ప్రభాకర్, లక్ష్మి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



కొత్తగూడ: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో ప్రజలను సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీలో ప్రసవించిన బాలింతతో మాట్లాడారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్యను పెంచాలని అన్నారు. అందుబాటులో ఉన్న మందులు, హాజరైన సిబ్బంది, రోజువారి ఓపీ వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

విద్య, వైద్యరంగాన్ని బలోపేతం చేయాలి



గంగారం: గ్రామ స్థాయిలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల బలోపేతానికి అధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సంపూర్ణ అభియాన్‌పథకంపై నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల వ్యవధిలో క్షేత్రస్థాయిలో హెల్త్ అండ్ న్యూట్రిషన్, విద్య, వ్యవసాయం, అంతర్గత అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అంతకు ముందు కస్తూర్బాగాంధీ విద్యాలయం, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. తాగునీరు, మరుగుదొడ్లు, కరెంట్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నర్మద, డీఏఓ అభిమన్యుడు, జిల్లా ఉద్యానశాఖ అధికారి మరియన్న, డీపీఓ హరిప్రసాద్, డీడబ్ల్యూఓ వరలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష, ఎంపీడీఓ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దారికాచిన మృత్యువు

ఎదురుగా వచ్చి ఆటోను ఢీ కొట్టిన కారు

- ముగ్గురి మృతి, మరో ముగ్గురి పరిస్థితి విషమం
- దంతాలపల్లి సమీపంలో ప్రమాదం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

సాక్షి, మహబూబాబాద్/దంతాలపల్లి: కారు ఆటోను ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందగా.. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన దంతాలపల్లి సమీపంలో ఖమ్మం- వరంగల్ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. మామ మృతిపై కోర్టు కేసు కోసం ఇంటిల్లిపాది వెళ్లినవారిలో ఒకరు.. రోజువారీ పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తున్నది మరొకరు.. వారిని గమ్యస్థానాలకు తీసుకెళ్తున్న ఆటో డ్రైవర్.. ఇలా ముగ్గురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

ముగ్గురి మృతి..

రెండు సంవత్సరాల క్రితం మహబూబాబాద్ మండలం ఆమనగల్‌కు చెందిన తన మామ అక్కెనపల్లి పెద్ద వెంకన్న మృతిపై శుక్రవారం మానుకోట కోర్టులో పని నిమిత్తం దంతాలపల్లి మండలం బీరిశెట్టి గూడెం గ్రామానికి చెందిన పైండ్ల కొమురయ్య(35) భార్య మంజుల, కుమార్తె అంజలితో కలిసి ఉదయం మహబూబాబాద్ వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని అత్తగారి ఇల్లు ఆమనగల్‌కు వెళ్లి బంధువులతో మాట్లాడాడు. అక్కడి నుంచి బంధువు కుమార్తె అక్షయను కూడా వెంట తీసుకొని బీరిశెట్టి గూడెం బయలు దేరాడు. తొర్రూరు చేరుకున్న కొమురయ్య కుటుంబ సభ్యులు గ్రామానికి బస్సు లేకపోవడంతో అడ్డాపై ఉన్న తొర్రూరు మండలం వెలికట్టె గ్రామానికి చెందిన బందు మల్లేశ్(45) ఆటోలో ఎక్కారు. అదేవిధంగా బీరిశెట్టిగూడెం శివారు వాల్యాతండాకు చెందిన భూక్య నరేశ్(25) రోజువారీగా ఉదయం తొర్రూరు వచ్చి అక్కడ విద్యుత్ పంపుసెట్ల షాపులో పనిముగించుకొని ఇంటికి తిరిగి వెళ్లేందుకు అదే ఆటోలో ఎక్కాడు. ఈ క్రమంలో ఆటో దంతాలపల్లి దాటి మరో పదినిమిషాల్లో బీరిశెట్టిగూడెం చేరుకునేది. కానీ ఒక్కసారిగా ఖమ్మం నుంచి దంతాలపల్లి వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేశ్, మల్లేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, అంబులెన్స్‌లో ఎక్కించేలోపు కొమురయ్య మృతి చెందాడు. అదేవిధంగా ఆటోలో ఉన్న అంజలి రెండు కాళ్లు విరిగి రక్తపు మడుగుల్లో కొట్టుమిట్టాడుతుండగా.. మంజుల, అక్షయ తలకు, ఇతర శరీర భాగాలకు బలమైన గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో ముగ్గురిని వరంగల్ ఆస్పత్రికి తరలించారు.





రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో(ఇన్‌సెట్‌లో), కారును పరిశీలిస్తున్న ఎస్పీ



మల్లేశ్, భూక్య నరేశ్, పైండ్ల కొమురయ్య(ఫైల్)

సంఘటన స్థలానికి ఎస్పీ

రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం డీఎస్పీ సురేష్, సీఐ సంజీవ, ఎస్సైలు కరుణాకర్, జగదీశ్, సతీష్‌తో మాట్లాడారు. పోస్టుమార్టం నిమిత్తం ముగ్గురి మృతదేహాలను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కారు బెలూన్లు తెరుచుకోవడంతో..

రోడ్డు ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. ఆటోను ఢీకొట్టిన కారు బెలూన్లు తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు ఎలాంటి గాయాలు తగలకుండా బయటపడ్డారు.

కుటుంబం అంతా ప్రమాదంలో..

రోడ్డు ప్రమాదంలో కొమురయ్య మృతి చెందగా.. భార్య మంజుల, కుమార్తె అంజలి, చుట్టపు చూపుగా ఇంటికి వస్తున్న అక్షయకు గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కొమురయ్య విగత జీవిగా పడి ఉండటం, మిగిలిన వారి పరిస్థితి ఎలా ఉంటుందో తెలియక పోవడంతో బీరిశెట్టి గూడెంలో విషాదం నెలకొంది.

పాపం చిన్న పిల్లల తండ్రి నరేశ్

ప్రమాదంలో మృతి చెందిన భూక్య నరేశ్‌కు ముగ్గురు చిన్న పిల్లలే. రోజు మాదిరిగా తొర్రూరు వెళ్లిన తమ తండ్రి పనులు ముగించుకొని తమకు కావాల్సినవి తెస్తాడని ఎదురు చూసే కుమార్తెలు జాన్సీ(9), కీర్తన(7), కుమారుడు కార్తీక్(5), భార్య కవిత.. నరేశ్ మరణవార్త వినగానే గుండెలవిసేలా రోదించారు.

వెలికట్టలో విషాద ఛాయలు

తొర్రూరు: విధికి కన్ను కుట్టింది. నిరుపేద కుటుంబం ఆశలను చిదిమేసింది. కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్న ఇంటి పెద్దను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. నిరుపేద కుటుంబానికి తీరని దుఃఖం మిగిల్చింది. మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బందు మల్లేశ్(45) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన బందు మల్లేశ్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య రేణుక, డిగ్రీ చదివే రాహుల్, ఇంటర్ చదివే ప్రేమ్‌కుమార్ సంతానం. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం మల్లేశ్‌పైనే ఆధారపడి జీవిస్తోంది. జీవన ప్రయాణంలో భాగంగా శుక్రవారం రాత్రి ఆటోలో తొర్రూరులో ప్రయాణికులను ఎక్కించుకుని మరిపెడ వైపు వెళ్తుండగా ఖమ్మం నుంచి వేగంగా ఎదురుగా వస్తున్న కారు దంతాలపల్లి మండలం చారితండా సమీపంలో ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న మల్లేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తొర్రూరు-మరిపెడ రూట్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. అందరితో కలివిడిగా తిరిగే మల్లేశ్ మృతితో గ్రామంలో స్నేహితులు, సన్నిహితులు శోకసంద్రంలో మునిగిపోయారు.

పెంచుకోండి.. పంచుకోకండి!



కొందరు ప్రేమతో.. మరికొందరు స్టేటస్ చూపడానికి.. ఇంకొందరు ఇంటికి రక్షణ కోసం మూగజీవాల్ని పెంచుతూ ఉంటారు. అనాదిగా మూగజీవాలతో మనిషికి విడదీయలేని బంధం. అయితే వీటి ఆరోగ్యంపై ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. సరైన సమయంలో టీకాలు వేయించకపోయినా.. అపరిశుభ్రంగా ఉన్నా.. వాటి ద్వారా ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వీటినే జూనోసిస్ (జంతువులు, మానవుల మధ్య వ్యాపించే ఏవియన్ ఫ్లూ, రేబిస్, రిఫ్ట్ వ్యాలీ ఫీవర్ వంటివి) వ్యాధులు అంటారు. ఈనేపథ్యంలో రేబిస్ అరికట్టేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో, కొన్ని ప్రైవేట్ సంస్థలు ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తున్నాయి. నేడు (శనివారం) జూనోసిస్ డే సందర్భంగా జంతుప్రేమికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' కథనం.

– హన్మకొండ /కాజీపేట/కాజీపేట అర్బన్

- పెంపుడు జంతువుల ద్వారా ప్రాణాంతక వ్యాధులు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

నేడు జూనోసిస్ డే

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెంపుడు జంతువులు వేల సంఖ్యలో ఉంటాయని వెటర్నరీ అధికారుల అంచనా. ట్రైసిటీ వాసులు 7 వేల కుక్కలు, 2 వేల పిల్లులు, 500లకు పైగా పక్షులను పెంచుకుంటున్నారు. వరంగల్ నగరంలో 28 వేల వీధి కుక్కలున్నట్లు అధికారులు చెబుతున్నారు. రోజుకో చోట పిల్లలు, పెద్దలపై కుక్కల దాడులు జరుగుతూనే ఉన్నాయి. కాగా పెంపుడు జంతువుల్ని సాకుతున్న వారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వైద్యులు తెలిపిన సూచనల ప్రకారం..

జూనోసిస్ డే ఎలా వచ్చిందంటే..

జూనోటిక్ వ్యాధులు జంతువులు, మానవుల మధ్య సంక్రమించే అనారోగ్యాలు. పిచ్చికుక్క కాటుకు గురైన వ్యక్తికి జూలై 6, 1885న ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ మొదటి టీకాను విజయవంతంగా అందించాడు. ఆ రోజునుంచి ప్రతీ ఏడాది ఇదే రోజున ప్రపంచ జూనోసిస్ డేగా జరుపుకుంటున్నారు.

ముందస్తు జాగ్రత్తలు..

- జంతు ప్రేమికులు ఎప్పటికప్పుడు చేతులు కడుక్కోవాలి. జంతువులను పరిశుభ్రంగా ఉంచాలి.
- మనుషులతో సన్నిహితంగా ఉండే జంతువులకు టీకాలు వేయించాలి. పశు వైద్యుడు సూచించిన టీకాల షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాలి.
- జూనోటిక్ వ్యాధులు, వాటి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ముందస్తుగా గుర్తించడం వల్ల వ్యాప్తిని నివారించవచ్చు.
- బయట తిరిగే, పెంపుడు జంతువులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. వాటిపై ఉన్న క్రిములను తొలగించాలి.
- కుక్కలు, పిల్లులకు 42 రోజుల నుంచి వ్యాక్సిన్ షెడ్యూల్‌ను తయారు చేసుకోవాలి.
- వ్యాక్సిన్స్ ఇవ్వడం ద్వారా రాబీస్‌తో పాటు వివిధ రకాల బ్యాక్టీరియాలు,రింగ్‌వార్మ్ వంటి రోగాల నుండి దూరం చేయవచ్చు.
- నాణ్యమైన ఫుడ్ అందజేయడం, పరిశుభ్రమైన స్థలంలో నివాసం ఏర్పాటు చేయాలి.

అవగాహన అవసరం..

- జూనోటిక్ వ్యాధుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.
- జంతు ఆరోగ్యంపై అధికారులు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే సదస్సుల్లో పాల్గొనాలి.
- జంతువుల్లో అనారోగ్య లక్షణాలను గమనిస్తుండాలి. వాటి ప్రవర్తన, ఆకలి, రూపంలో మార్పులు రావడం, రోజువారీకంటే అసాధారణంగా కనిపిస్తే వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి.
- ఇవి పశుపోషకులు, పెంపుడు జంతువుల యజమానులు, వ్యవసాయ రైతులకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. వీరు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి.

క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలి..



మూగజీవాలు అమితమైన ప్రేమను కనబరుస్తుంటాయి. నేటి ఆధునిక యుగం, యాంత్రిక జీవనంలోనూ మూగ జీవాలను సాదుకునేందుకు చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ట్రైసిటీలో కుక్కలు, పిల్లులు పెంచుకునేందుకు ఎక్కువ ఇష్టపడుతున్నారు. కుక్కలు, పిల్లులకు మూడు నెలలకోసారి వ్యాక్సిన్‌తో పాటు పశువైద్యశాలకు చికిత్స నిమిత్తం తీసుకురావాలి.

– డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పశువైద్యాధికారి, వడ్డేపల్లి

ఆరోగ్య సేవలను వినియోగించుకోండి

బయ్యారం: రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఆరోగ్య సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని డీఎంహెచ్ఓ కళావతిబాయి సూచించారు. మండలంలోని వెంకట్రాంపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్యశిబిరాన్ని ఆమె సందర్శించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీబీడీసీ పీఓ సుధీర్‌రెడ్డి, డీపీహెచ్ఎన్ మంగమ్మ, సబ్‌యూనిట్ ఆఫీసర్ గోపిచంద్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైద్యాధికారి సాగర్ పాల్గొన్నారు.



ఆరోగ్య శిబిరానికి హాజరైన వారి వివరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నెహ్రూసెంటర్: ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఎంహెచ్ఓ కళావతిబాయి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని అమ్మ ఆస్పత్రిని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నిబంధనలు పాటించకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ధరల పట్టిక ఏర్పాటు చేయకపోవడం, అర్హత లేని సిబ్బంది, పరిశుభ్రత పాటించకపోవడంతో అమ్మ ఆస్పత్రికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ధరల పట్టిక, డాక్టర్ల వివరాలను ప్రదర్శించాలని, ఫైర్ సేఫ్టీ పరికరాలను అమర్చుకోవాలని సూచించారు. ప్రతి ఆస్పత్రికి పార్కింగ్ స్థలం తప్పకుండా ఉండాలని, లేని ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహేందర్‌రెడ్డి, మంగమ్మ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ కళావతిబాయి సూచించారు. అర్బన్ పీహెచ్‌సీ పరిధిలోని కృష్ణకాలనీ, పత్తిపాకలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా, దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. అర్బన్ పీహెచ్‌సీ డాక్టర్ విజయ్‌కుమార్, డీపీహెచ్ఎన్ఓ మంగమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారి ఒబిలిశెట్టి రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ నితిన్‌గౌడ్, సిస్టర్లు బబిత, లలిత తదితరులు ఉన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని ఉపసంహరించుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

మహబూబాబాద్: బొగ్గు గనుల వేలాన్ని ఉపసంహరించుకోవాలని, గనులను సింగరేణికి కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథిరెడ్డి, ఎన్డీ డివిజన్ కార్యదర్శి లింగ్యా, ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్త పల్లి రవి డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. బొగ్గు గనుల వేలాన్ని వెంటనే ఆపాలన్నారు. బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను అదానీ, అంబానీలకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తుందన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ పార్లమెంట్ సభ్యులను గెలిపిస్తే, ఆ ప్రభుత్వం చేసే పనులు ఇలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా బొగ్గు గనుల వేలంపై కఠినంగా వ్యవహరించాలన్నారు. వేలం ఆపకపోతే సింగరేణి కార్మికులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. బొగ్గు గనుల వేలాన్ని ఆపకపోతే వామపక్షాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌సారథిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కోటేష్, పాపయ్య, వీరన్న, పెరుగు కుమార్, నవీన్, వెంకన్న, సాంబలక్ష్మి, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, సందీప్, హరి, శ్రావణ్, చిరంజీవి, ప్రవీణ్, శంకర్, కవిత, పద్మ, వికాస్, రమేశ్ పాల్గొన్నారు.

పెరుగుతున్న జ్వరపీడితులు

ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల తాకిడి

- ఒకేరోజు 800మందికి పైగా రాక
- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

నెహ్రూసెంటర్: వానాకాలం ప్రారంభంలోనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. శుక్రవారం ఒకరోజే జ్వరాలు, ఒళ్లు నొప్పులు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న 800మందికి పైగా రోగులు ఆస్పత్రికి వచ్చారు. వారికి పరీక్షలు చేసిన వైద్యులు అవసరం ఉన్నవారికి మందులు అందజేశారు. కాగా ఓపీతో పాటు ఆస్పత్రిలో అడ్మిట్ అవుతున్న రోగులసంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ఆస్పత్రిలో బెడ్లు సరిపోక రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదిలా ఉండగా వానాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

అప్‌గ్రేడ్ అయినా..

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి 330పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ సరిపడా బిల్డింగ్, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. జ్వరాలు, రోడ్డు ప్రమాదాలు, పురుగుల మందు తాగి ఇలా ఎక్కువ సంఖ్యలో ఆస్పత్రికి వస్తుండడంతో స్ట్రెచర్‌పై వైద్యం అందించాల్సి వస్తుంది. నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనం అందుబాటులోకి వస్తేనే రోగులు ఇబ్బందులు తొలగనున్నాయి.

ప్రతీరోజు వెయ్యికి పైనే..

ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ఓపీతో పాటు రోగుల ఇన్‌పేషెంట్ సంఖ్య పెరుగుతోంది. ప్రతీరోజు వెయ్యి వరకు రోగులు ఆస్పత్రికి వస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. అయితే సరిపడా బెడ్లు, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, వైద్యులు కూడా సరిగా అందుబాటులో ఉండడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్రమతంగా ఉంటేనే..

వ్యాధులకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు తెలుపుతున్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరాల బారిన పడిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. సీజనల్ ముప్పు తొలగే వరకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



ఆస్పత్రి మెడికల్ వార్డులో కిక్కిరిసిన రోగులు

గార్లలో విషజ్వరాలు..

గార్ల: మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీ మంగలితండా, ఎస్టీ కాలనీలో విషజ్వరాలు విజృభించాయి. వారం రోజులుగా పలువురు మంచానికే పరిమితమయ్యారు. మంగలితండాకు చెందిన బానోత్ భద్రు డెంగీ జ్వరంతో బాధపడుతుండగా, బి.సిరి, వేణుగోపాల్, ఎ.సరిత, బి.రామ్‌సింగ్, బుజ్జి, భీక్షం, కమల, లాలు, కవిత, బిందు, సింధు, సోనా, వీరు విషజ్వరాలతో బాధపడుతున్నారు. స్థానికంగా ఆర్ఎంపీలను ఆశ్రయిస్తూ వైద్యం చేయించుకున్నా జ్వరం తగ్గకపోవడంతో ఖమ్మం, మహబూబాబాద్ పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుని ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారి స్పందించి విషజ్వరాలను అరికట్టేందుకు తండాల్లో ప్రత్యేకంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



విషజ్వరాలతో బాధపడుతున్న తండావాసులు

ఒళ్లు నొప్పులతో ఆస్పత్రిలో చేరా..



ఒళ్లు, కాళ్ల నొప్పులతో ఆస్పత్రిలో చేరాను. నాలుగు రోజుల నుంచి చికిత్స పొందుతున్న. సెలైన్ బాటిళ్లు పెట్టి, సూదులు వేస్తున్నారు. త్వరగా వైద్యం అందకపోవడంతో రోజుల తరబడి ఆస్పత్రిలో ఉండాల్సి వస్తుంది.

– బాదావత్ మంగీలాల్, జంగిలిగొండ

డెంగీ జ్వరమని చెప్పారు..



జ్వరం రావడంతో నాలుగు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరాను. డెంగీ జ్వరమని డాక్టర్లు చెప్పారు. జ్వరం తగ్గిపోయింది.. మరోసారి పరీక్షలు నిర్వహించి పంపిస్తామని డాక్టర్లు చెప్పారు. సరైన సమయంలో వైద్యం అందించారు.

– కరిష్మా, రాజులకొత్తపల్లి

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం..



ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. సీజనల్ వ్యాధులు ప్రారంభం కావడంతో ఎక్కువ సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. ప్రతీ రోజు వెయ్యికి పైగా రోగులకు వైద్య సేవలను అందిస్తున్నాం. ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించేలా చూస్తున్నాం.

– శ్రీనివాసరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్

స్కూల్‌ బస్సు ఢీకొని మహిళ మృతి


లక్ష్మి(ఫైల్‌)

కాశిబుగ్గ: స్కూల్‌ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన క్రిస్టియన్‌కాలనీలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రేటర్‌ వరంగల్‌ 18వ డివిజన్‌ క్రిస్టియన్‌కాలనీకి చెందిన గబ్బేట లక్ష్మి(49) ఉదయం పాల ప్యాకెట్‌ తీసుకు రావాడానికి కిరాణ షాపునకు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుంది. అదేసమయంలో హంటర్‌ రోడ్డు త్రివి హై స్కూల్‌కు చెందిన బస్సు ఢీకొట్టింది. దీంతో లక్ష్మి తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే మృతి చెందింది. ఈఘటనతో బయాందోళనకు గురైన డ్రైవర్‌ గుర్రం శ్రీనివాస్‌ బస్సు ఆపకుండా సరాసరి స్కూల్‌ వద్దకు తీసుకెళ్లాడు. బస్సు డ్రైవర్‌ ఆతివేగంగా ఆజాగ్రత్తగా నడపడంతో తన తల్లి మృతి చెందిందని మృతురాలి కుమార్తె రాజ్యలక్ష్మి మిల్స్‌కాలనీ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లయ్య తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని ..


ప్రమీల (ఫైల్‌)

నర్మెట: ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన జనగామ జిల్లా నర్మెట మండలంలోని కన్నెబోయిన గూడెంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బిచ్చాల ప్రమీల (50) మహిళాసంఘం మీటింగ్‌కు హాజరై రాత్రి 9.30 గంటలకు ఇంటికి తిరిగి వస్తుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన దిండిగాల గణేశ్‌ ద్విచక్రవాహనంపై అతివేగంతో ఎదురుగా వచ్చి ఢీ కొట్టడంతో తీవ్రగాయాలు కావడంతోపాటు కాలు, చెయ్యి విరిగాయి. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలి స్తుండగా మృతిచెందింది. ప్రమీల భర్త సిద్ధ య్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటుల ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు.

అంగీకారపత్రాల అందజేత



నూతన పాలకమండలి సభ్యులతో రిజిస్ట్రార్‌ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ నూతన పాలకమండలి సభ్యులుగా నియమితులైన వారు శుక్రవారం తమ అంగీకారపత్రాలను రిజిస్ట్రార్‌ ఆచార్య మల్లారెడ్డికి అందజేశారు. రిజిద్స్ట్రార్‌ మల్లారెడ్డి క్యాంపస్‌లోని అకాడమిక్‌ కమిటీ హాల్‌లో వారితో సమావేశమయ్యారు. పాలకమండలి సభ్యులుగా నియమితులైనట్లుగా తొలుత రిజిస్ట్రార్‌ వారికి ఉత్తర్వులు అందజేశారు. అనంతరం వారి నుంచి అంగీకార పత్రాలను తీసుకున్నారు. అంగీకార పత్రాలు అందజేసినవారిలో ప్రొఫెసర్‌ బానోతు సురేష్‌లాల్‌, డాక్టర్‌ భీరాధి సుకుమారి, అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు డాక్టర్‌ బొద్దిరెడ్డి రమ, డాక్టర్‌ మల్లం నవీన్‌, వివిధ రంగాల్లో ప్రముఖల కేటగిరిలో అనితారెడ్డి, పుల్లూరి సుధాకర్‌, డాక్టర్‌ చిర్ర రాజు ఉన్నారు. వీరిని రిజిస్ట్రార్‌ ఆచార్య మల్లారెడ్డి, కేయూ ఫైనాన్స్‌ ఆఫీసర్‌ తోట రాజయ్య పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు. మరో ఇద్దరు పాలకమండలిసభ్యులు యూనివర్సిటీ లా కాలేజీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సుదర్శన్‌, న్యాయవాది మధుబాలు చౌహాన్‌ ఈనెల 6న అంగీకార పత్రాలు రిజిస్ట్రార్‌కు ఇవ్వనున్నట్లు సమాచారం.

నైపుణ్య పెంపుతో ఉద్యోగ అవకాశాలు




కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు

రోజురోజుకూ పెరుగుతున్న పోటీ
- విషయపరిజ్ఞానం అవసరం
- అవకాశాలు అందిపుచ్చుకోవాలంటున్న నిపుణులు
- పట్టుదలతో లక్ష్యసాధన

కాజీపేట: నైపుణ్య పెంపుతో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటున్నారు నిపుణులు. కోర్సు చదివామా? పూర్తి చేశామా? అన్న చందంగా కాకుండా లక్ష్య సాధన కోసం కృషి చేస్తే తప్పక విజయం సాధిస్తారనేది వాస్తవం. ప్రస్తుత కాలంలో చాలామంది యువకులు గ్రాడ్యుయేషన్‌ పూర్తి చేసి కూడా ఖాళీగా ఉంటున్నారు. ఇప్పటి వరకు కష్టపడి చదివేశాం. కాస్తంత విశ్రాంతి తీసుకుందామనుకుంటే.. పొరపాటే.. ప్రస్తుత కాలంలో యువత ఆలోచనల్లో ఎటువంటి మార్పులు రావడం లేదనే చెప్పవచ్చు. మిగితా రాష్ట్రాల యువతతో పోలిస్తే మన రాష్ట్రంలో ఎక్కువ మంది యువత ఎలాంటి లక్ష్యాన్ని ఎంచుకోవడంలేదు.. ఫలితంగా ఖాళీగానే ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. యువత కాలేజీ రోజుల్లోనే మనం ఏం చేయగలం, ఏ దారిలో వెళితే భవిష్యత్‌ బాగుంటుంది.. అన్న విషయాన్ని గమనించి ఆ దిశగా అడుగులు వేస్తే జీవితం సుఖమయంగా సాగుతుంది. ఏ స్కిల్స్‌ ఉంటే రాబోయే పోటీ ప్రపంచంలో పరిస్థితులను ఎదుర్కొగలమనే విషయాలను యువత గమనించుకోవాలి. కానీ, నేటి తరం యువత ఆ దిశగా ఆలోచించకపోవడంతో రోజు రోజుకూ నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోంది. చాలా మందికి ఎంత టాలెంట్‌ ఉన్నా.. తగిన ఉద్యోగం లభించదు. దానికి కారణం కేవలం స్కిల్స్‌ లేకపోవడమే. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే జీవితంలో హాయిగా జీవించాలంటే నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ప్రస్తుత జాబ్‌ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలు అందిపుచ్చుకోవడం వల్ల ఏ చదువు చదివినా.. అందుకు తగ్గట్టుగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ప్రస్తుత ప్రపంచానికి కావాల్సింది మంచి స్కిల్‌ ఉన్న యువత. ప్రపంచంలోని టెక్నాలజీకి తట్టుకునేలా యువత అడుగులు వేయాలి. కొంతమంది యువత కనీసం ఇంటర్వ్యూలను కూడా ఎదుర్కోలేక చతికిల పడిపోతున్నారు. ఇప్పటి యువత డ్రీమ్‌ జాబ్‌ సాఫ్ట్‌వేర్‌ ఈ రంగంలో ఉద్యోగం సంపాదించాలంటే స్కిల్స్‌ ఎంతో అవసరం.

డిజిటల్‌ మార్కెటింగ్‌..

ప్రస్తుతం సాఫ్ట్‌వేర్‌ రంగంతో పోటీగా ఉద్యోగాలు ఇస్తూ యువతను ఆకట్టుకుంటుంది డిజిటల్‌ మార్కెటింగ్‌ రంగం. రాబోయే రోజులన్నీ డిజిటల్‌ మార్కెటింగ్‌ మీదనే ఆధారపడి ఉంటాయని నిపుణుల అంచనా. ఏ వస్తువు కొనాలన్నా ఆన్‌లైన్‌లోనే చేస్తుండడంతో ఈ రంగానికి డిమాండ్‌ పెరిగింది.

ఇంగ్లిష్‌పై పట్టు తప్పనిసరి..

ప్రస్తుతం ఒక మంచి ఉద్యోగం సాధించాలంటే ఇంగ్లిష్‌ వచ్చి ఉండాలి. ఆంగ్ల భాష రాకపోవడం వల్ల చాలా మంది యువత ఉద్యోగ అవకాశాలను చేజార్చుకుంటున్నారు. ఇంగ్లిష్‌ మీద మంచి పట్టు సాధిస్తే ఎలాంటి రంగంలోనైనా యువతరం ఉద్యోగాన్ని దక్కించుకోవచ్చు. ఏ రంగంలోనైనా విజయాన్ని కైవసం చేసుకోవచ్చు.

ప్రోగ్రామింగ్‌..

ప్రస్తుతం సాఫ్ట్‌వేర్‌ రంగం ఎంతగానో అభివృద్ధి చెందింది. దీంట్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉంటున్నాయి. కావున ఇందుకు తగ్గట్టుగా.. ప్రోగ్రామింగ్‌ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి. యువత ఇలాంటి ప్రోగామింగ్‌ మీద ఎక్కువ శ్రద్ధ చూపించి నైపుణ్యం పొందితే జీవితం బంగారు మయమే అవుతుంది.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



యువత జీవితంలో రాణించడానికి లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలి. కష్టపడి చదివితే అనుకున్న బాటలో నడవడంతోపాటు చక్కటి జీవితాన్ని అనుభవించవచ్చు. లేదంటే జీవిత ప్రయాణం ముళ్ల బాటగా మారకతప్పదు.

– మార్క వెంకటమల్లయ్య, రిటైర్డ్‌ హెచ్‌ఎం

విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలి



విద్యార్థులు చదవుల తోపాటు అన్ని అంశాలపై పట్టును కలిగి ఉండాలి. విషయ పరిజ్ఞానం లేకపోతే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడం కష్టం. విద్యార్థులు కళాశాల స్థాయిలోనే స్కిల్స్‌ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలి.

– తాళ్ల వంశీ, డైరెక్టర్‌, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్‌ కళాశాల

చదువుకున్న దొంగ..!

- ఎంబీఏ చదివి.. సైబర్‌ నేరాలకు పాల్పడుతున్న యువకుడు
- అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సైబర్‌ క్రైమ్‌ ఏసీపీ విజయ్‌ కుమార్‌


నిందితుడి అరెస్టు చూపుతున్న సైబర్‌ క్రైమ్‌ ఏసీపీ విజయ్‌కుమార్‌

వరంగల్‌ క్రైం: ఓయువకుడు ఎంబీఏ వరకు చదివాడు.. జల్సాలకు అలవాటుపడి ఈజీ మనీ కోసం దొంగదారిని ఎంచుకున్నాడు.. తనకున్న కంప్యూటర్‌ పరిజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని నిరుద్యోగుల నుంచి డబ్బులు దండుకునే చర్యలకు పాల్పడ్డాడు. చివరకు కటకటాల పాలయ్యాడు. ఈఘటనకు సంబంధించి సైబర్‌ క్రైమ్‌ ఏసీపీ విజయ్‌కుమార్‌ వెల్లడించిన వివరాల ప్రకారం.. సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానంటూ నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయాలు వసూలు చేసిన సైబర్‌ నేరస్తుడిని వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ సైబర్‌ విభాగం పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి, నిందితుని నుంచి రూ.2లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చట్రాయి మండలం చిట్టాపూర్‌ గ్రామానికి చెందిన పొనగంటి సాయితేజ ఎంబీఏ వరకు చదివి, కొన్ని కంపెనీల్లో పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. అదేసమయంలో జల్సాలకు అలవాటుపడి, సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. తనకున్న కంప్యూటర్‌ పరిజ్ఞానంతో ఉద్యోగ అవకాశాలు కల్పించే వెబ్‌సైట్లలో వివరాలు నమోదు చేసుకున్న నిరుద్యోగుల సెల్‌ఫోన్‌ నంబర్లను సేకరించాడు. బ్యాక్‌ డోర్‌ ద్వారా సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని నమ్మించాడు. స్పందించిన నిరుద్యోగుల నుంచి ఇంటర్వ్యూ, పరీక్షలు, ట్రెనింగ్‌ పేరిట రూ.లక్షల్లో వసూళ్లు చేసేవాడు. ఇదే తరహాలో హనుమకొండకు చెందిన ఓ నిరుద్యోగి నుంచి సుమారు రూ.మూడు లక్షలకుపైగా వసూలు చేసి ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ చేయడంతో బాధితుడు వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ సైబర్‌ క్రైమ్‌ విభాగంలో ఫిర్యాదు చేశాడు. దీంతో సైబర్‌ క్రైమ్‌ పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈక్రమంలో నిందితుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 35మంది నిరుద్యోగుల నుంచి రూ.45లక్షల వరకు వసూలు చేసినట్లు అంగీకరించాడు. ఇదిలా ఉండగా.. కమిషనరేట్‌ పరిధిలో సైబర్‌ క్రైమ్స్‌ విభాగం ఏర్పాటు చేసిన కొద్ది కాలంలోనే కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకున్న ఏసీపీ విజయ్‌కుమార్‌, ఇన్‌స్పెక్టర్‌ రవి, ఎస్సైలు శివ, చరణ్‌ కానిస్టేబుళ్లను సీపీ అభినందించారు.

పీజీ నాలుగో సెమిస్టర్‌ పరీక్షలు షురూ


ఆర్ట్స్‌ కాలేజీలో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న రిజిస్ట్రార్‌ మల్లారెడ్డి, ప్రిన్సిపాల్‌

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్‌, ఖమ్మం, అదిలాబాద్‌ జిల్లాల్లో శుక్రవారం ఎంఏ, ఎంకామ్‌, ఎమ్మెస్సీ తదితర పీజీ కోర్సుల నాలుగో సెమిస్టర్‌ పరీక్షలు ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల పరీక్షా కేంద్రంలో కేయూ రిజిస్ట్రార్‌ ఆచార్య మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. వీరివెంట ఆర్ట్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ఆచార్య జ్యోతి ఉన్నారు.

డిగ్రీ సెమిస్టర్‌ ఫలితాలు విడుదల

హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజీ (అటానమస్‌)లో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్‌ పరీక్షలు ఈఏడాది ఏప్రిల్‌ –మే నెలలో నిర్వహించారు. ఈ మేరకు ఆయా సెమిస్టర్‌ పరీక్షల ఫలితాలను శుక్రవారం ఆ కళాశాలలో కేయూ రిజిస్ట్రార్‌ ఆచార్య మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి, కళాశాల ప్రిన్సిపాల్‌ ఆచార్య జ్యోతితో కలిసి విడుదల చేశారు. డిగ్రీ కోర్సుల రెండో సెమిస్టర్‌ పరీక్షలకు 1,026మంది హాజరుకాగా 429మంది ఉత్తీర్ణత (41.81శాతం) సాధించారని ప్రిన్సిపాల్‌ జ్యోతి తెలిపారు. నాల్గో సెమిస్టర్‌ పరీక్షలో 1,053మందికి 540మంది (51.28శాతం), ఆరో సెమిస్టర్‌ పరీక్షలో 731మందికి 526మంది (71.96శాతం) ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఆ కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పుల్లా రమేశ్‌, పరీక్షల కోఆర్డినేటర్‌ డాక్టర్‌ గిరిప్రసాద్‌, డాక్టర్‌ భిక్షపతి, డాక్టర్‌ రాజు, డాక్టర్‌ ప్రసాద్‌ పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీతో నిరంతర విద్యుత్‌


నిడిగొండలో నూతన పరికరాలను పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

చిల్పూరు/రఘునాథపల్లి: నూతన టెక్నాలజీతో నిరంతర విద్యుత్‌ సరఫరాలో భాగంగా పైలట్‌ ప్రాజెక్టుగా ఎంపికైన నిడిగొండ, చిన్నపెండ్యాల గ్రామాల్లోని 33/11 కేవీ సబ్‌ స్టేషన్‌లలో జరుగుతున్న పనులను శుక్రవారం టీజీఎన్పీడీసీఎల్‌ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పరిశీలించారు. చిల్పూరు మండలం చిన్నపెండ్యాల, రఘునాథపల్లి మండలంలోని నిడిగొండ సబ్‌ స్టేషన్లను సందర్శించారు. మొదట సబ్‌ స్టేషన్‌ ఆవరణల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చిన్నపెండ్యాలలో ఆయన మాట్లాడారు. నార్తర్న్‌ పవర్‌ డిస్ట్రిబ్యూషన్‌ తెలంగాణ లిమిటెడ్‌ కొత్త టెక్నాలజీకి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా టీజీ ఎన్పీడీసీఎల్‌ పరిధిలోని అన్ని 33/11కేవీ ఫీడర్లను రియల్‌ టైమ్‌ మానిటరింగ్‌ అండ్‌ కంట్రోలింగ్‌ టెక్నాలజీని తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈకొత్త టెక్నాలజీతో సబ్‌ స్టేషన్లలో లోడ్‌, పవర్‌ ఫ్యాక్టర్‌, ట్రిప్పింగ్స్‌లు, బ్రేక్‌డౌన్‌లు, ఎల్‌సీలు పూర్తిగా జరిగిన సమాచారం తెలుసుకోవచ్చని అన్నారు. ఈకొత్త టెక్నాలజీ అమలు పర్చడానికి పైలట్‌ ప్రాజెక్టు కింద స్కోప్‌ స్కైండర్‌ అనే కంపెనీలకు స్టేషన్‌ఘన్‌పూర్‌ నియోజకవర్గంలోని చిన్నపెండ్యాల, నిడిగొండ సబ్‌స్టేషన్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇక్కడ పనులు పూర్తికాగానే సరఫరా పనితీరు అనుకున్న విధంగా ఉంటే టీజీ ఎన్పీడీసీఎల్‌ మొత్తం టెక్నాలజీ అమలు చేస్తామన్నారు. దీంతో మానవ రహిత విద్యుత్‌ సబ్‌స్టేషన్లుగా మార్చవచ్చని అన్నారు. కార్యక్రమంలో సీజీఎం ఆపరేషన్‌ కిషన్‌, జీఎంఅండ్‌ ఐటీ శ్రీనివాస్‌, డీఈ టెక్నికల్‌ శ్రీధరాచారి, అనీల్‌కుమార్‌, ఎస్‌ఈ ఆపరేషన్‌ వేణుమాధవ్‌, డీఈ ఆపరేషన్‌ జనగామ లక్ష్మీనారాయణ, ఏడీఈ ఆపరేషన్‌ మనోహర్‌రెడ్డి, సత్యనారాయణ, డీఈ హుస్సేన్‌నాయక్‌, ఏఈలు రమేశ్‌, రాహుల్‌, సబ్‌ఇంజనీర్లు దిలీప్‌రెడ్డి, లైన్‌ఇన్‌స్పెక్టర్‌ యాదగిరి, ఎల్‌ఐ చంద్రశేఖర్‌, తిరుపతి, అశోకు, విజయ్‌కుమార్‌, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నతస్థాయికి ఎదుగుతారు


దోర్నకల్‌: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ రామారావు

గూడూరు: విద్యార్థులు చదువుతోనే ఉన్నతస్థాయికి ఎదుగుతారని డీఈఓ రామారావు అన్నారు. మండల కేంద్రంలోని బాలికల హైస్కూల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఉదయం 9 గంటలకు ప్రార్థనలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. అనంతరం తరగతి గదులు తిరుగుతూ వారి చదువు సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉపాధ్యాయులతో సమావేశమై సమయానికి హాజరు కావాలని, ఉత్తమ బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత, రాజ్యలక్ష్మి, ఉమా రాణి, శ్రీలత, పుష్పనీల, సుమతి పాల్గొన్నారు.

లక్ష్యాలు నిర్దేశించుకుని చదవాలి

దోర్నకల్‌: పదో తరగతి విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ రామారావు కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళిక రూపొందించి బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఇంటర్‌ విద్యార్థిని ఆత్మహత్య



అనురాధ(ఫైల్‌)

కేసముద్రం: ఇంటర్‌ సెకండియర్‌లో ఫెయిల్‌ కావడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జిలుకర సునిత, సురేష్‌ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కూతురు జిలుకర అనురాధ(19) కల్వల మోడల్‌ స్కూల్‌లో ఇంటర్‌ చదవగా, ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఫెయిల్‌ అయింది. దీంతో గత నెల 28న ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగింది. మరుసటి రోజు విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆమెను మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఈనెల 2న వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించడంతో ఈనెల 4న హైదరాబాద్‌ నిమ్స్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. శుక్రవారం మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అమ్మానాన్న.. నన్ను క్షమించండి..!

- కడపలో యువకుడి ఆత్మహత్య
- అమీనాబాద్‌లో అలుముకున్న విషాదఛాయలు


రంజిత్‌ (ఫైల్‌)


రంజిత్‌ రాసిన సూసైడ్‌ నోట్‌

చెన్నారావుపేట: అమ్మా, నాన్నా నన్ను క్షమించండి.. మీ ఆశలు నెరవేర్చలేకపోతున్నాను.. అని సూసైడ్‌ నోట్‌ రాసి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటనకు సంబంధించి, స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌ జిల్లా చెన్నారావుపేట మండలం అమీనాబాద్‌ గ్రామానికి చెందిన చీర మల్లేశం– కళావతిలకు కుమార్తె, కుమారుడు రంజిత్‌(25) ఉన్నారు. కుమార్తెకు వివాహం జరిపించారు. కుమారుడు అగ్రికల్చర్‌ బీఎస్సీ పూర్తి చేసి ఉన్నత చదువులు చదువుతూ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాస్తున్నాడు. ఇటీవల ఓ పోటీ పరీక్షలో తక్కువ మార్కులు రావడంతో ఉద్యోగం రాలేదని మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో స్నేహితుడు ప్రశాంత్‌ అక్క వివాహానికి మూడు రోజుల క్రితం తన స్నేహితులతో కలిసి వెళ్లాడు. పట్టణంలోని ఎర్రముక్కలపల్లి రోడ్డు వద్ద ఓ ప్రముఖ లాడ్జీని అద్దెకు తీసుకున్నారు. గురువారం తన స్నేహితులు టిఫిన్‌ చేయడానికి వెళ్లారు. రంజిత్‌ రాకపోవడంతో స్నేహితులు గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉన్నాడు. పోలీసులకు తెలియజేసి, రిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రంజిత్‌ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం రంజిత్‌ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. చేతికొచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు పలువురి కంటతడి పెట్టించింది.

యువకుల మృతికి కల్తీ కల్లు కారణం కాదు

- ఎక్సైజ్‌ శాఖ డిప్యూటీ కమిషనర్‌ అంజన్‌రావు


రామన్నగూడెంలో రహీం ఇంటి వద్ద విచారణ చేస్తున్న నాగేందర్‌రావు

తొర్రూరు/నర్సింహులపేట: మానుకోట జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో యువకుల మృతికి కల్తీ కల్లు కారణం కాదని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు వరంగల్‌ ఎక్సైజ్‌ శాఖ డిప్యూటీ కమిషనర్‌ అంజన్‌రావు తెలిపారు. కల్తీ కల్లు, మద్యం సేవించడం వల్లే రామన్నగూడెంలో ఇరువురు యువకులు మృతి చెందారన్న ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం డివిజన్‌ కేంద్రంలోని ఎక్సైజ్‌ పోలీస్‌ స్టేషన్‌లో అధికారులు దర్యాప్తు వివరాలు వెల్లడించారు. అసిస్టెంట్‌ కమిషనర్‌ నాగేందర్‌రావు, ఏఈఎస్‌ ప్రవీణ్‌లతో కలిసి డిప్యూటీ కమిషనర్‌ అంజన్‌రావు మాట్లాడారు. నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో గత నెల 10న దొంతు విజయ్‌ జన్మదిన వేడుకల్లో 15 మంది స్నేహితులు పాల్గొన్నారని, అదే రోజు యువకులు గ్రామంలో కల్లు, మద్యం సేవించారని, అందులో ముగ్గురు యువకులు అస్వస్థతకు గురయ్యారన్నారు. వేడుకల్లో పాల్గొన్న బోగోజు శ్రావణ్‌ గత నెల 17న మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడని, ఆరోగ్యం కుదుట పడకపోవడంతో గత నెల 24న ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా జాండీస్‌ ఉందని నిర్ధారించారన్నారు. జూన్‌ 30న అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి యువకున్ని తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 3న మృతి చెందాడన్నారు. మరో యువకుడు రహీం పాషా సైతం వేడుకల అనంతరం ఈ నెల 2న జ్వరంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడన్నారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 3న మృతి చెందాడన్నారు. మరో యువకుడు ఉపేంద్రాచారి సైతం అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. కల్తీ కల్లు, మద్యం సేవించడం వల్లే యువకులు మృతి చెందారని ఆరోపణలు వెల్లువెత్తిన తరుణంలో సదరు గ్రామానికి వెళ్లి దర్యాప్తు చేపట్టామన్నారు. రామన్నగూడెంలో కల్లు నమూనాలను సేకరించామని కల్తీ జరిగినట్లు ఎక్కడా నిర్ధారణ జరగలేదన్నారు. కల్తీ మద్యం కారణమైతే వేడుకలో భాగంగా కల్లు తాగిన 15 మంది అస్వస్థతకు గురయ్యేవారన్నారు. కల్తీ కల్లు ప్రభావం వెంటనే చూపుతుందని, మృతులు వేడుక జరిగిన 15 రోజుల తర్వాత ఆస్పత్రిలో చేరి మరణించారని గుర్తు చేశారు. దానికి కల్తీ కల్లు కారణమై ఉండకపోవచ్చని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిపారు. అంతకు ముందు రామన్నగూడెంలో పోలీస్‌, ఎక్సైజ్‌ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వరంగల్‌ ఎక్సైజ్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ నాగేందర్‌రావు విచారణ చేపట్టారు. మృతులు కల్లు తాగిన ప్రదేశాన్ని పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించామని, పోస్టుమార్టం రిపోర్టు, ఫోరెన్సిక్‌ రిపోర్టు ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ ప్రవీణ్‌, సీఐ నాగయ్య, ఎస్సై తిరుపతి, రజిత, సీఐ సంజీవ్‌, ఎస్సై సతీష్‌ పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం

- డాక్టర్‌ అమరేశ్వరి


సమావేశంలో మాట్లాడుతున్న అమరేశ్వరి

ఖిలా వరంగల్‌: పల్లెల్లో పెరటి కోళ్ల పెంపకంతో మెరుగైన ఆదాయం లభిస్తుందని పీవీ నరసింహారావు తెలంగాణ వ్యవసాయ పశువైద్య విశ్వవిద్యాలయం, పశుపరిశోధనా స్థానం అధిపతి డాక్టర్‌ అమరేశ్వరి తెలిపారు. సీనియర్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ హనుమంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం అకిల భారత కోళ్ల పరిశోధనా స్థానం సౌజన్యంతో ట్రైబల్‌ సబ్‌ ప్లాన్‌ కింద ములుగు జిల్లా నిరుద్యోగ యువత, మహిళలకు కోళ్ల పెంపకం, మెలుకువలు, సూచనలపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అమరేశ్వరి శిక్షణ శిబిరం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ మహిళలు, యువత పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారిస్తే అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. కోళ్ల పెంపకంపై అవగాహన పెంచుకోవాలని, కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని పది మందికి ఉపాధి మార్గం చూపాలని సూచించారు. అనంతరం శిక్షణకు హాజరైన 15మంది రైతులకు ఒక్కొక్కరికి పదివేల విలువైన 20పెరటి కోళ్లు, ఫీడర్స్‌, వాటర్స్‌, రాత్రి పూట ఉంచేందుకు గృహ వసతి(నైట్‌ షెల్టర్‌ కూప్స్‌) ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్‌ నరసింహ తదితరులు పాల్గొన్నారు

మార్కెట్‌ వ్యాల్యూపై మంత్రికి నివేదిక


మంత్రితో భేటీ అయిన జిల్లా అధికారులు

కాజీపేట అర్బన్‌: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా భూమి విలువలను పెంచేందుకుగాను సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల వారీగా నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్‌ జిల్లా నుంచి డీఐజీ సుభాషిణి, జిల్లా రిజిస్ట్రార్‌ హరికోట్ల రవి ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని భూముల విలువల పెంపునకు చేపట్టిన నివేదికను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అందజేసేందుకు శుక్రవారం భేటీ అయ్యారు. దీంతో మార్కెట్‌ వ్యాల్యూ పెంపు ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్లు సమాచారం.